క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవితేజ

వెంకటగిరి రూరల్ : ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చెవిరెడ్డిపల్లి పీహెచ్‌సీ వైద్యులు రవితేజ పేర్కొన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బంగారుపేటలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సిబ్బంది శివరామకృష్ణ, ఏఎన్‌ఎం భారతి, సచివాలయం అధికారులు వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు రూరల్ : స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు పస్తులతో కాలం గడుపుతున్నారని తెలిపారు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ ప్రభాకర్, ఎంబేటి చంద్రయ్య, శశి, కాలేషా, రమేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు షీల్డుల అందజేత



షీల్డులు అందుకున్న క్రీడాకారులతో జన విజ్ఞాన వేదిక సభ్యులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గురువారం నిర్వహించిన హాకీ పోటీల్లో విజేతలకు శుక్రవారం జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు షీల్డులు అందజేశారు. చిల్లకూరు ఎంఈవో రవూఫ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచి క్రీడలపై మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, హాకీ కోచ్ ఆకాష్ దీపక్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద శుక్రవారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధ మహిళలకు దుస్తులు, నగదు అందజేశారు. సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు మాట్లాడుతూ దర్భా శారదమ్మకు దాతలు దీవి కిషోర్‌బాబు, మాధవి, రసజ్ఞ రూ.3500 విలువ చేసే దుస్తులు, కొంత నగదు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గురువు సులభాదేవి, వేదాంతం యుగంధర్ చక్రవర్తి, పరిపూర్ణానందస్వామి, పారా హేమంత్ కుమార్ శర్మ, కోన సాయిబాబు శర్మ, కుంబాల మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్లిరిసిడియా మొక్కలతో భూమి సారవంతం

వెంకటగిరి రూరల్ : గ్లిరిసిడియా మొక్కలు సాగుచేసి భూమిలో కలియ దున్నితే సారం పెరుగుతుందని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త బి.గోవిందరాజులు తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మునగ కాయలు, ఆకులను ఆహారంగా తీసుకుంటే పోషక విలువలు పెరుగుతాయన్నారు. నిమ్మతోటల్లో గ్లిరిసిడియా మొక్కలను సాగుచేసుకోవాలన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు రాజీవన, విజయశ్రీ, నాగార్జునరెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో పుష్పయాగంలో పాల్గొన్న ఉభయకర్తలు



అమ్మవారికి ఘనంగా పుష్పాభిషేకం



ఘనంగా పుష్పయాగం

సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పుష్పాభిషేకాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి 108 రకాల పుష్పాలతో యాగం చేశారు. చెన్నైకి చెందిన నంబూరు మోహన్‌రావు-సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి-లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. - సూళ్లూరుపేట

మహావిష్ణువు ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

రాపూరు/సైదాపురం : రాపూరు సమీపంలోని మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు 2 గ్రాముల వెండి లక్ష్మీదేవి డాలర్, పసుపు, కుంకుమ, పూజ సామగ్రి, రవిక, గాజులు, అమ్మవారి ఫొటో అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పెంచలకోనలో సామూహిక కుంకుమార్చన

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీ దేవికి శుక్రవారం సామూహిక కుంకుమార్చన, ఆస్థానం, ప్రాకారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో ఆదిలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని పద్మపీఠంపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించి ఆస్థానం చేపట్టారు. అనంతరం ప్రాకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా శశిస్వామి, సాయికుమారి వ్యవహరించారు. అదేవిధంగా సైదాపురంలోని శ్రీబాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

నేడు రెవెన్యూ కోర్టు

దొరవారిసత్రం : బూదూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పడిన భూవివాదంపై శనివారం డీవీ సత్రం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కోర్టు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. తొలుత కొన్ని సర్వే నంబర్లలోని రైతులు, రియల్టర్లను పిలిచి విచారిస్తామని తెలిపారు. ఇప్పటికే బూదూరు గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని పేర్కొన్నారు.

శ్మశానం సమస్య పరిష్కారం

కోట: చిట్టేడులో ఎస్టీల శ్మశానవాటిక సమస్యకు శుక్రవారం పరిష్కారమైంది. ఇక్కడ ఎరుకుల తెగకు చెందిన కుటుంబాల వారు 20 ఏళ్లగా నివాసం ఉంటున్నారు. గతంలో అధికారులు శ్మశానానికి 30 సెంట్ల భూమి కేటాయించారు. దాన్ని కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నించారు. తహసీల్దార్ జయ జయరావు స్థలాన్ని సర్వే చేసి గిరిజనులకు అప్పగించారు.

కండలేరులో 6.650 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.650 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 2870 క్యూసెకుకలనీరు చేరుతుందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 200, లోలెవల్ కాలువకు 70,హైలెవల్ కాలువకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యూనిఫాం కోసం రూ 10 వేలు వితరణ

చిల్లకూరు : మండలంలోని పున్నపువారిపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు యూనిఫామ్ కుట్టించుకునేందుకు శుక్రవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రూ.10 వేలు ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి బాబు, హెచ్‌ఎం స్వతంత్రకుమారి, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం రాజు, విద్యా కమిటీ చైర్ పర్సన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ఆక్రమణలను త్వరితగతిన తొలగించాలని చైర్ పర్సన్ కటకం దీపిక అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నాయుడుపేట మున్సిపాలిటీకి చెందిన స్థలాలు, రోడ్డును కొంతమంది ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని తెలిపారు. ఈ క్రమంలో మున్సిపల్, పోలీసు అధికారులతో కలిసి వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి మున్సిపాలిటీ అభివృద్ధి తోడ్పాటు అందించాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వెంకటగిరి రూరల్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ అబ్దుల్‌షరీద్ తెలిపారు. ఈ సందర్భంగా 25 వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చిస్తామని తెలిపారు. కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

ఉద్యోగాలకు 19 మంది ఎంపిక

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం గ్రీన్‌ల్యాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 47 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 19 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కళాశాల కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

ఆహ్లాదం కలిగించేలా పార్కుల అభివృద్ధి

నాయుడుపేట టౌన్: ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో పార్కులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా నాయుడుపేట బీఎంఆర్ నగర్‌లో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అటవీశాఖ ఎక్షన్ అధికారిణి ధనలక్ష్మీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ చైర్ పర్సన్ మైలారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెళ్లకూరు: తిరుపతి స్విమ్స్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం పునబాక, శిరసనంబేడు గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన పలువురికి వైద్యులు, సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. అలాగే వచ్చే నెల 2న తాళ్వాయిపాడు, 4న కానూరు, 6న బంగారంపేట గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్విమ్స్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ పద్మావతి, పెళ్లకూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ ఉమా, స్థానిక సర్పంచులు చిత్ర, పెంచలయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తి చేయాలని నిరసన



గ్రామస్తులతో మాట్లాడుతున్న రైల్వే ఏఎస్‌సీ రాజయ్య



అసంపూర్తిగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి

తడ: పెరియవట్టు పంచాయతీ పెరియవట్టు కుప్పం, బాలాజీ కుప్పం, పకీరు కండ్రిగ గ్రామాలకు వెళ్లే రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. 14 నెలల క్రితం అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు చుట్టూ తిరిగి కావలిమిట్ట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమస్యను గతంలో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా బ్రిడ్జి పనులు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ట్రాక్ సమీపంలో రోడ్‌డ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అది కార్యరూపం దాల్చలేదు. వానాకాలం సమీపిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో మండల స్థాయి అధికారులు, రైల్వే అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి జిల్లా కలెక్టర్, రైల్వే డీజీఎంతో ఫోనులో మాట్లాడారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, అప్పటి వరకు గ్రామస్తుల రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నై రైల్వే ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజయ్య, ఇన్‌స్పెక్టర్ భూమినాథన్, డీఈఎన్ నివాస్ యాదవ్, ఏఈఎన్ మురారి, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఇన్‌చార్జి తహసీల్దార్ శరత్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎస్ఐ కొండప్ప నాయుడు, స్థానిక సర్పంచ్ చిన్నప్పన్, వైస్ ఎంపీపీ రమేష్ పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

గూడూరు రూరల్ : గిట్టుబాటు ధర కల్పించాలని ఆక్వా రైతులు కోరారు. వారు శుక్రవారం గూడూరులోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎగుమతిదారులు ఒక్కటై ధరలు తగ్గించడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. నాణ్యమైన సీడ్ ఇవ్వకపోవడంతో రొయ్య పిల్లలు చని పోతున్నాయని ఆరోపించారు. నకిలీ సీడ్‌లను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన ఫీడ్ అందించేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని పేర్కొన్నారు. ఎగుమతిదారులతో చర్చించి మద్దతు ధర కల్పించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు ఆవుల మనోహరరెడ్డి, సీపీఐ కాలేషా, రవీంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర కల్పించాలని కోరుతున్న ఆక్వా సంఘం నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

దక్కిలి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మాధవయ్యపాళెం ఎస్టీ కాలనీలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ ఆరుగురికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఏడుగురు చిన్నారులకు జనన ధ్రువీకరణ మంజూరు చేయాలని, 10 మంది పిల్లలకు ఆధార్ కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీల వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాదిరెడ్డి మాధవరెడ్డి, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ అల్లాబక్షు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు, ఏపీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



వెంకటగిరి: మొక్కలు నాటుతున్న ప్రజా ప్రతినిధులు



చిల్లకూరు : మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

గూడూరు రూరల్ : మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అటవీశాఖ అధికారులు జ్ఞానప్రకాష్, రమణయ్య, కోటేశ్వరరావు, మురళీ, రవి,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం) : విరివిగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చని ఫారెస్ట్ రేంజర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ తంబిరెడ్డి తనుజా రెడ్డి, ఎంపీడీవో కోటేశ్వరరావు, పులుకొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్, తంబిరెడ్డి శివారెడ్డి, ఏపీపీ ప్రకృతికుమార్ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వాకాడు : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని తహసీల్దార్ రామయ్య తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించిన వనం మనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో తమ పాఠశాలలో నాటిన మొక్కలు నేడు పెద్ద వృక్షాలయ్యాయని తెలిపారు. వాటిని చూసినప్పుడు ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ విజయకుమార్ పాల్గొన్నారు.

భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలి

చిల్లకూరు : విరివిగా మొక్కలు నాటి భావితరాల వారికి స్వచ్ఛమైన గాలి అందిద్దామని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బండ్ల సుధాకర్ పిలుపునిచ్చారు. పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ నేడు వాతావరణ కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతినిందని, దాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. ఉపాధ్యాయులు వీవీ కుమార్, ప్రజేంద్రరెడ్డి, చంద్ర, మాధవయ్య, మంజుశ్రీ, ఆదిలక్ష్మీ, సౌందర్య, నాగభూషణమ్మ, సురేంద్ర, శ్రీనివాసులు, కామేశ్వరి, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

గూడూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్, యూపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యదర్శి సుధీర్, నాయకులు రవి, మురళీమోహన్, ప్రాణేష్, వరప్రసాద్, మురళీసింగ్, నాగేశ్వరరావు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నిరసన

సూళ్లూరుపేట రూరల్ : యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ వద్దని, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల యూటీఎఫ్ నాయకులు కోరారు. వారు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జేజే రాజశేఖర్, జిల్లా నాయకులు ప్రభాకర్, సునీలా, సీఐటీయూ నాయకులు అల్లెయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : ఏకీకృత పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఉపాధ్యాయులు శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగులను మోసం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న యూపీఎస్ పెన్షన్ విధానం వద్దన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు రాజేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయుడు పేట, ఓజిలి పెళ్లకూరుల మండలాల యూటీఎఫ్ అధ్యక్షులు సుబ్బారావు, జీ శ్రీనివాసులు, శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాపూరులో ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న గేట్ మీటింగ్

రాపూరు: ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ డిపో కార్యదర్శి రమణయ్య డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కార్మికులతో కలిసి రాపూరు ఆర్టీసీ డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నైట్‌అవుట్ అలవెన్స్‌లను జీతంలో కలిపి అరియర్స్ ఇవ్వాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు నగదు అందజేయాలని కోరారు. ఏఏఎస్ ఇంక్రిమెంట్, సిక్ శాలరీ ఇవ్వాలని, కార్మికులకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ కార్యదర్శి సుధాకర్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

వెంకటగిరి రూరల్ : ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న పీటీడీ సర్వీసు ఉద్యోగులకు వెంటనే పెండిగ్ బకాయిలను చెల్లించాలని డిపో రీజనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సతీష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కార్మికులతో కలిసి ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాల చెల్లింపులో ట్రెజరీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ పీవీరావు, డిపో కార్యదర్శి కేవీ రత్నం, వైస్ ప్రెసిడెంట్ కేఆర్ బాబు, జాయింట్ సెక్రటరీ బాషా, సుబ్బారావు, విజయ్‌కుమార్, గ్యారేజీ అధ్యక్షుడు రాజా, సెక్రటరీ లక్ష్మణరావు, కృష్ణ పాల్గొన్నారు.